ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాల భర్తీ

- త్వరలో 15 వేల 'పోలీస్' పోస్టులు
- టీఎస్‌పీఎస్సీతో నియామకాలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- త్వరలో వైద్యారోగ్య శాఖలో ఐదు వేల ఉద్యోగాలు నింపుతాం
- మంత్రి దామోదర రాజనర్సింహ
- ఎల్బీస్టేడియంలో నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేత

ఎల్బీస్టేడియంలో ఎండధాటికి ఇబ్బంది పడుతున్న నర్సింగ్ ఆఫీసర్ల అభ్యర్థులు

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): ఏడాదిలోగా రాష్ట్రంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. త్వరలో 15 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీచేస్తామని చెప్పారు. వైద్యారోగ్య శాఖలో నర్సింగ్ ఆఫీసర్స్/స్టాఫ్‌నర్స్ పోస్టులకు ఎంపికైన 6,956 మందికి బుధవారం ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. డిసెంబర్ 7న తాము ఎల్బీస్టేడియంలోనే ప్రమాణం చేసినట్టు గుర్తు చేశారు. అప్పుడు తమ కుటుంబసభ్యులు ఎంతో సంతోషించారని చెప్పారు. ఇప్పుడు నర్సింగ్ అభ్యర్థులు నియామక పత్రాలు పొందుతుంటే తాము కుటుంబ సభ్యులుగా మారి ఆ సంతోషాన్ని చూడాలనే ఉద్దేశంతో ఎల్బీ స్టేడియంలో కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని మరోసారి స్పష్టం చేశారు. టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసి కొత్త చైర్మన్, సభ్యులను నియమించామని తెలిపారు. తాము ఉద్యోగాలు భర్తీ చేయడానికి ప్రయత్నిస్తుంటే.. మాజీ మంత్రి హరీశ్‌రావు శాపనార్థాలు పెట్టారని ఆరోపించారు.

రెండు నెలల్లోనే నియామక పత్రాలు

పుట్టిన పాప దగ్గర నుంచి మనిషి చివరి శ్వాస వరకు ప్రతి ఒక్కరి ఆరోగ్య అవసరాల్లో వెన్నంటి ఉండేది నర్సులేనని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే దాదాపు ఏడు వేల మందికి నియామక పత్రాలు ఇస్తున్నామని చెప్పారు. వైద్యశాఖలో మరో ఐదు వేల పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, వేణుగోపాల్‌రావు, సీఎస్ శాంతికుమారి, హెల్త్ సెక్రటరీ క్రిస్టీనా జడ్ చొంగ్తు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణణ్ పాల్గొన్నారు.

బట్టీ పట్టని 'భట్టి'

నర్సింగ్ ఆఫీసర్ నియామక పత్రాల అందజేత సందర్భంగా డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క తన ప్రసంగంలో తీవ్రంగా తడబడ్డారు. ఆర్థిక మంత్రి అయ్యుండి ఏకంగా నిధులను 15 రెట్లు ఎక్కువగా చెప్పడంతో 'భట్టి లెక్కలు బట్టీ పట్టలేదనుకుంటా' అంటూ సెటైర్లు వినిపించాయి.

'టిమ్స్' నర్సుల ధర్నా

కొవిడ్ సమయంలో టిమ్స్‌లో పనిచేసిన నర్సులు బుధవారం ఎల్బీ స్టేడియం వద్ద ధర్నా చేశారు. తాము ప్రాణాలు లెక్క చేయకుండా చేసిన సేవలకు గుర్తింపుగా నర్సింగ్ నియామకాల్లో 20 శాతం వెయిటేజీ ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని కానీ ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

మండుటెండలో తిప్పలు

నియామక పత్రాల కోసం వచ్చిన నర్సింగ్ ఆఫీసర్లకు ఎల్బీ స్టేడియంలో చుక్కలు కనిపించాయి. ఉదయం 9 గంటలకు స్టేడియానికి వచ్చిన అభ్యర్థులు సాయంత్రం 4 గంటల వరకు ఎండలోనే మగ్గాల్సి వచ్చింది. వారికోసం మైదానం మధ్యలో కుర్చీలు వేసిన అధికారులు పైన నీడను మాత్రం కల్పించలేకపోయారు. తల్లులతోపాటు వచ్చిన కొందరు చంటి పిల్లలు అల్లాడిపోవాల్సి వచ్చింది. ప్రేక్షకుల గ్యాలరీకి పైకప్పు ఉన్నప్పటికీ అందులో కూర్చోవడానికి అనుమతి ఇవ్వకపోవడంతో రోజంతా ఎండలోనే ఉండాల్సి వచ్చింది.

ఇకపై 'ఆఫీసర్లు'గా స్టాఫ్ నర్సులు

నమస్తే కథనంతో ప్రభుత్వ నిర్ణయం

స్టాఫ్ నర్సులను 'నర్సింగ్ ఆఫీసర్లు' గా గుర్తించాలంటూ నమస్తే తెలంగాణలో వచ్చిన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఎల్బీస్టేడియంలో నిర్వహించిన నియామక పత్రాల పంపిణీలో నర్సులను 'నర్సింగ్ ఆఫీసర్'గా గుర్తించింది. నర్సింగ్ ఆఫీసర్లకు నియామకపత్రాలను అందించే కార్యక్రమానికి ప్రభుత్వం ఇటీవల ఆహ్వాన పత్రాలు రెడీ చేసింది. ఇందులో 'స్టాఫ్‌నర్స్'లకు నియామక పత్రాలు అందించే కార్యక్రమంగా పేర్కొన్నది. వాస్తవానికి డీఎంఈ, కుటుంబ సంక్షేమ శాఖల్లో పనిచేస్తున్న, టీఎస్‌పీఎస్సీ ద్వారా నియమితులైన స్టాఫ్‌నర్సులహోదాను 'నర్సింగ్ ఆఫీసర్లు'గా మార్చుతూ అక్టోబర్ 6న జీవో ఇచ్చింది. దీనిని విస్మరించి ఇంకా స్టాఫ్‌నర్సులుగా ఆహ్వానపత్రం ముద్రించడంతో సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. 6,956 నియామకాల్లో 90 శాతం మంది 'నర్సింగ్ ఆఫీసర్లే' అని పేర్కొన్నారు. ఈ నెల 29న నమస్తే తెలంగాణ 'నర్సింగ్ ఆఫీసర్లు'గా గుర్తించండి అంటూ వార్త ప్రచురించింది. దీంతో అదేరోజు ఆహ్వాన పత్రిక ల్లో 'నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందించే కార్యక్రమం' అంటూ మార్చింది.

కాంగ్రెస్‌ది సెల్ఫ్ డబ్బా

- తామే నర్సింగ్ నియామకాలు చేసినట్టు సొంత ప్రచారం
- 50 రోజుల్లోనే నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేశారా?
- నిజం చెప్తే శాపనార్థాలంటరా?
- ముఖ్యమంత్రి రేవంత్‌కు కాంగ్రెస్ అభిష్టానమైనా గడ్డిపెట్టాలి
- ముఖ్యమంత్రిపై హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఎల్బీ స్టేడియం వేదికగా నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాల అందజేత పేరిట ఆర్భాటం చేసిందని, తాము ఊహించినట్టుగానే నియామకాలు మొత్తం వాళ్లే చేసినట్టు డబ్బా కొట్టుకున్నారని వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తీరు చెప్పేదికొండంత.. చేసేది గోరంత కూడా లేదు అన్నట్టున్నదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను వంచిందని కల్లబొల్లి మాటలు చెప్పిన రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన నర్సింగ్ ఆఫీసర్ల భర్తీ ప్రక్రియను తమ ఘనతగా చెప్పుకునే ప్రయత్నం చేస్తూ తన అబద్ధాల ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వచ్చిన 50 రోజుల్లోనే స్టాఫ్‌నర్స్ నోటిఫికేషన్ ఇచ్చి, నియామక పత్రాలు ఇచ్చారా? మాకు కుళ్లు లేదు, కడుపులో నొప్పీ లేదు. సొమ్మొక్కడిది సోకు ఇంకొకడిది అన్నట్టు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడంలో రేవంత్ వ్యవహరించిన తీరునే తప్పుపడుతున్నాం. కేసీఆర్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే ఈ నర్సుల నియామక పత్రాలు ఇచ్చిన విషయాన్ని మరచిపోవద్దు. నర్సులుగా ఉద్యోగాలు పొందిన వారికి కూడా వాస్తవాలు తెలుసు. తెల్లారితే గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తారనుకున్న నిరుద్యోగుల ఆశలపై రేవంత్‌రెడ్డి నీళ్లు చల్లారు. అయన ప్రసంగంలో దీని గురించి ఒక్క మాట లేదు. ఎన్నికల సమయంలో ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామని ప్రచారం చేశారు. పత్రికల్లో మొదటి పేజీలో ప్రకటనలు గుప్పించారు. ఇప్పుడు నోరు మెదపటం లేదు. మేము యదార్థం చెబితే, శాపనార్థాలు అని మాట్లాడారు తప్ప నోటిఫికేషన్ల గురించి చెప్పలేదు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలే అని రేవంత్ మరోసారి నిరూపించారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు పెంపు, రూ.500కు సిలిండర్, రూ.4 వేల పింఛన్, మహాలక్ష్మి ద్వారా రూ.2500, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, నిరుద్యోగ భృతి వంటి అమలు కానీ హామీల లిస్ట్‌లో జాబ్ క్యాలెండర్ కూడా చేరింది. అసలు ఉద్యోగాల గురించి, నిరుద్యోగుల బాధల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు ఎక్కడిది. 2004 నుంచి 2014 వరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసింది 10 వేల ఉద్యోగాలు మాత్రమే కాదా? అప్పుడు నిరుద్యోగ యువతను మోసం చేసింది చాలక ఇప్పుడు మరోసారి మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నదెవరు? ఉద్యోగ నియామకాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రికార్డు సృష్టించింది. తొమ్మిదిన్నరేండ్లలో లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేయగా, మరో 40 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో ఉన్నది వాస్తవం కాదా? కేసీఆర్ ప్రభుత్వం మీద ఉద్యోగాల భర్తీకి సంబంధించి రేవంత్ మాట్లాడినదంతా డొల్ల అని రుజువైంది' అని మండిపడ్డారు. సీఎం హోదాలో తప్పుడు మాటలు చెప్పి నిరుద్యోగులను రెచ్చగొట్టవద్దని, రోజూ అబద్ధాలు మాట్లాడే రేవంత్‌కు కనీసం కాంగ్రెస్ అధిష్టానమైనా గడ్డి పెట్టాలని హితవు చెప్పారు.

నేడు కేసీఆర్ ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు గురువారం గజ్వేల్ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణం చేయనున్నారు. మధ్యాహ్నం సుమారు 12 గంటల ప్రాంతంలో ఆయన అసెంబ్లీకి చేరుకోనున్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్నారు. కేసీఆర్ తుంటి ఎముకకు ఆపరేషన్ కావడంతో డాక్టర్ల సూచన మేరకు గత కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. శస్త్రచికిత్స నుంచి కోలుకున్న కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలందరినీ హాజరుకావాల్సిందిగా సమాచారం అందించారు.

ఆ నోటీసులేవో కోమటిరెడ్డికి పంపండి

మాణిక్కం ఠాకూర్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ): పరువునష్టం నోటీసులు పంపాల్సింది తనకు కాదని, వాటిని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పంపాలని కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాకూర్‌కు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. తనపై పరువునష్టం దావా వేస్తానన్న మాణిక్కం వ్యాఖ్యలపై ఎక్స్ ద్వారా కేటీఆర్ స్పందించారు. మాణిక్కం ఠాకూర్‌కు రేవంత్‌రెడ్డి రూ.50 లక్షల లంచం ఇచ్చి పీసీసీ పదవిని కొనుక్కున్నారంటూ అప్పట్లో కోమటిరెడ్డి ఆరోపించారని, ఈ విషయం మీడియాలోనూ వచ్చిందని గుర్తు చేశారు. అదే విషయాన్నే తాను ప్రస్తావించినట్టు పేర్కొన్నారు. ఈ విషయంలో కోమటిరెడ్డి తన ఆరోపణలను వెనక్కి తీసుకోలేదని, వివరణ కూడా ఇవ్వలేదని, కాబట్టి ఆ నోటీసులను తనకు కాకుండా సచివాలయంలో కూర్చున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పంపాలని కేటీఆర్ సూచించారు.

ఆ రెండు లక్షల ఉద్యోగాలెక్కడ?

ఆ ఖాళీల వివరాలు వెల్లడించాలి.. సర్కార్‌ను ప్రశ్నించిన మాజీ ఎంపీ వినోద్

కరీంనగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 31: 'ప్రభుత్వ శాఖలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పదే పదే చెప్పింది. ప్రచారంలో ఇదే ప్రధానాస్త్రంగా లేవనెత్తింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చారు కదా? సదరు పోస్టులు ఏయే ప్రభుత్వ శాఖల్లో ఉన్నాయో? విభాగాల వారీగా బహిరంగపరచాలి' అని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి చివరి నాటికి ఆ కొలువులను గుర్తించి మొత్తం రెండు లక్షల లెక్క యువతకు చెప్పాలని సవాల్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొత్తగా ఉద్యోగాలు సాధించిన నర్సింగ్ స్టాఫ్‌కు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి అట్టహాసంగా ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడాన్ని తాము సంతోషిస్తున్నామని, అయితే ఈ ఉద్యోగాల ప్రక్రియను పూర్తి చేసింది కేసీఆర్ పాలనలోనేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించి ఉద్యోగ పత్రాలు అందించి ఉంటే ఇంకా ఎక్కువ సంతోషించే వారమని పేర్కొన్నారు. ఈ నర్సింగ్ స్టాఫ్ పోస్టులకు సంబంధించి గత డిసెంబర్‌లోనే అప్పటి మంత్రి హరీశ్‌రావు ఏడు వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష నిర్వహించిందని, కానీ ఎన్నికల కోడ్ కారణంగా ఫలితాలు, ఉద్యోగాల భర్తీ నిలిచి పోయిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి 2023 అక్టోబర్ 16 నాటికి రాష్ట్రంలో 1,60,083 ఉద్యోగాలను టీఎస్‌పీఎస్సీ, పోలీస్, రెసిడెన్షియల్, హెల్త్, యూనివర్సిటీలు తదితర విభాగాల్లో భర్తీ చేసినట్టు చెప్పారు. మరో 42,652 ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు కూడా పూర్తి చేసినట్టు గుర్తుచేశారు. ఈ సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తదితరులు తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ నుంచి 80 మంది స్టాఫ్‌నర్స్‌లు

- గత ప్రభుత్వంలో నర్సింగ్ అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నియమించిన స్టాఫ్ నర్సుల్లో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 80 మంది అభ్యర్థులు ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోనే మొట్టమొదటిగా హైదరాబాద్‌ను పైలట్‌గా ఎంచుకొని నర్సింగ్, జీఎన్ఎం పూర్తిచేసిన దళిత యువతులకు విదేశాల్లో ఉద్యోగావకాశాలను కల్పించేందుకు చర్యలు చేపట్టింది. నర్సింగ్ పూర్తిచేసి, విదేశాల్లో ఉపాధి పొందాలనే ఆసక్తి, ఆర్హత ఉన్న దళిత యువతులను ఎంపిక చేసి, ఫినిషింగ్ స్కూల్, షార్పెనింగ్ స్కిల్స్‌పై మూడునెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. ఫీజును ప్రభుత్వమే చెల్లించింది. స్టాఫ్‌నర్స్‌లుగా ఉద్యోగాలను పొందిన అభ్యర్థులకు తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సీహెచ్ సైదులు శుభాకాంక్షలు తెలియజేశారు.

కోదండరాం అర్హత లేమిటి? నా దగ్గర లేనిదేమిటి?

మొదటిపేజీ తరువాయి...

మండిపడ్డారు. రాజకీయ నాయకుడినంటూ తన పేరును తిరస్కరించిన గవర్నర్.. ఒక పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కోదండరాంను ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దొడ్లలో చెప్పులు మోసేవారిని కేసీఆర్ ఎమ్మెల్సీలుగా నామినేట్ చేశారంటూ వ్యాఖ్యానించిన సీఎం రేవంత్‌రెడ్డి ఎరుకలను అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎరుకల జాతికి రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పద్ధతిగా మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు. ఎరుకల కులంలో పుట్టిన తనకు జనరల్ స్థానంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన చరిత్ర ఉన్నదని చెప్పారు. ఎరుకల జాతి నుంచి కనీసం ఎంపీటీసీ కూడా లేని పరిస్థితుల్లో ఎమ్మెల్సీగా తనను కేసీఆర్ నామినేట్ చేశారని చెప్పారు. తన పేరును గవర్నర్ తిరస్కరించినపుడు ఇంకో ఎరుకల కులస్థుడిని ఎందుకు నామినేట్ చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ఎరుకల సంఘం అధ్యక్షుడు కుతాడి రాములు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి తమ జాతిని అవమానించారని మండిపడ్డారు. తమ కులానికి ఎమ్మెల్సీగా లేక లేక అవకాశం వస్తుందనుకుంటే గవర్నర్ దక్కకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

బీజేపీకి బీ టీం కాంగ్రెస్

- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలే నిదర్శనం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఫైల్‌ను తొక్కిపెట్టిన గవర్నర్
- కాంగ్రెస్ ఎమ్మెల్సీల ఫైల్‌ను ఎలా ఆమోదించారు?
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం

శామీర్‌పేట మండలం ఆలియాబాద్‌లో కీసర మండల బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

మేడ్చల్/శామీర్‌పేట/మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 31: బీజేపీకి బీ టీం కాంగ్రెస్ అని, ప్రధాని మోదీతో భేటీ అయ్యాకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమయ్యారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని కీసర మండల బీఆర్ఎస్ కృతజ్ఞతా సభను బుధవారం శామీర్‌పేట మండలం ఆలియాబాద్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. గవర్నర్ కోటాలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిఫారసు చేసిన ఎమ్మెల్సీల ఫైల్‌ను తొక్కిపెట్టిన గవర్నర్.. కాంగ్రెస్ ప్రభుత్వం సిఫారసు చేసిన ఎమ్మెల్సీ ఫైల్‌ను 2 రోజుల్లోనే ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. ప్రాంతీయ పార్టీలను కాలరాయడమే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ పనిచేస్తున్నాయని మండిపడ్డారు.

ఏది చచ్చిన పార్టీ?

గత అసెంబ్లీ ఎన్నికల్లో 1.8% ఓట్ల తేడాతోనే బీఆర్ఎస్ ఓటమి పాలైందని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. దీనికే కాంగ్రెస్ ఎగిరి పడుతున్నదని మండిపడ్డారు. 1.8% ఓట్ల తేడాతో ఓడిన పార్టీ చచ్చిన పార్టీ అయితే, 2014లో కేవలం 29% ఓట్లు సాధించిన కాంగ్రెస్ ఏమైనట్టు అని ప్రశ్నించారు. ఉన్నత విద్యావంతులు, అణగారిన వర్గాల ప్రతినిధులైన కుర్ర సత్యనారాయణ, దాసోజు శ్రావణ్‌కుమార్ గురించి దొడ్లో చెప్పులు మోస్తారంటూ అహంకారపూరితంగా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం గర్హనీయమని నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ప్రజలను చైతన్యపర్చాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలు, అభివృద్ధి మీద బీఆర్ఎస్ 4,700 ప్రశ్నలు సంధిస్తే.. కాంగ్రెస్, బీజేపీ 800 ప్రశ్నలు మాత్రమే వేశాయని చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, మున్సిపాలిటీల చైర్మన్లు కౌకుంట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్, జడ్పీ వైస్‌చైర్మన్ వెంకటేశ్, చామకూర భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాల్సిందే

లేకుంటే ప్రజలే కాంగ్రెస్‌ను బొందపెడతారు • మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

వేల్పూర్, జనవరి 31: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీని ప్రజలే బొందపెడతారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలిపిస్తేనే హామీలు వంద శాతం నెరవేరతాయని సీఎం రేవంత్‌రెడ్డి అనడంపై వేముల మండిపడ్డారు. గ్యారంటీలు అమలు చేయకుండా పారిపోవడానికే ఇలా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం లక్కోరలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఇందులో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలను ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. సోషల్ మీడియాలో చేసిన దుష్ప్రచారాన్ని సకాలంలో పసిగట్టలేకపోయామని, దానివల్లే కాంగ్రెస్ లబ్ధి పొందిందని వివరించారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్న హామీలను పార్లమెంట్ ఎన్నికలకు ముందే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణం తెచ్చుకుంటే.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారని, జరిగిందా? అని ప్రశ్నించారు. పంట కోత దశకు చేరుతున్నా రైతుబంధు ఎందుకు అందలేదో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో మంజూరైన 6 వేల గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లను రద్దు చేశారని విమర్శించారు.

అక్రమ కేసులకు భయపడం: పల్లా

బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తున్నదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కేసులకు భయపడేరోజ్లం కాదని, హామీల అమలుకు ప్రజలతో కలిసి పోరాడుతామని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై నోటికొచ్చినట్టు తప్పుడు ప్రచారం చేసి అబద్ధాన్ని నిజమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. లక్ష కోట్ల అవినీతి జరిగితే రంగనాయకసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో 3 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఎలా వచ్చిందో ఆలోచన చేయాలని సూచించారు. ఎన్నికల ముందు రైతుబంధు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన నిధులు ఏమయ్యాయని పల్లా ప్రశ్నించారు.

తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులను అందజేస్తున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు

కార్యకర్తల కుటుంబాలకు అండగా పార్టీ

- మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి
- 64 కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున చెక్కుల పంపిణీ

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): చనిపోయిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తల ప్రమాద బీమా చెక్కులను ఆయన పంపిణీచేశారు. మొత్తం 64 కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందించారు. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ ప్రమాద వశాత్తు చనిపోయిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండేందుకు అధినేత కేసీఆర్ ముందుచూపుతో ప్రమాద బీమా అమలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యే చందర్, నాయకులు అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ఒక్క గెలుపుకే అంత మిడిసిపాటా?

- దేశంలో కాంగ్రెస్ ఎక్కడ మిగిలింది?
- అధికారం శాశ్వతం కాదు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ దేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉన్నదని, ద